ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-11-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

ముఖ్యాంశాలు

- ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడులకు, భారత్ తొలి ప్రాధాన్య గమ్యంగా ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు.

- ఆలయాల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు.

- రాష్ట్ర పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులు రానున్నాయని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

- సీఐఐ సదస్సులో సింగపూర్‌తో జరిగిన ఒప్పందం ఓ అద్భుత ప్రయాణానికి నాంది అని మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు.

====================

ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడులకు భారత్ తొలి ప్రాధాన్య గమ్యంగా ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విశాఖలో ఈరోజు ప్రారంభమైన సీఐఐ భాగస్వామ్య సదస్సుకు 72 దేశాల నుండి 522 మంది ప్రతినిధులు, 2 వేల 500 మంది పారిశ్రామిక వేత్తలు, వివిధ రంగాల ప్రతినిధులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో పరిశ్రమలకు అనుమతులు ఇస్తున్నామని, రియల్ టైమ్‌లో అనుమతులు ఇవ్వడంతో పాటు త్వరితగతిన పరిశ్రమలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. విశాఖ.. దేశంలోనే అత్యంత సుందరమైన నగరమని, అత్యంత సురక్షిత నగరంగా ఇటీవలే రేటింగ్ కూడా వచ్చిందని చెప్పారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, ఆర్గానిక్ ఉత్పత్తులు, పర్యాటకం తదితర రంగాల్లో అపారమైన అవకాశాలను వినియోగించుకోవాలని పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేస్తూ...

(వాయిస్…31 సెకన్లు)

====================

విశాఖలో ఈరోజు ప్రారంభమైన సీఐఐ భాగస్వామ్య సదస్సును ఉద్దేశించి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ఆంధ్రప్రదేశ్ వరుసగా 8వ సారి ఆతిథ్యం ఇస్తోందని, దేశ విదేశాలకు చెందిన ప్రతినిధులు హాజరైన ఈ సదస్సు ప్రపంచ వాణిజ్యాన్ని ప్రతిబింబిస్తోందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని ఫ్యూచర్ రెడీ ఇన్నోవేషన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. ఈ సదస్సు ద్వారా ప్రతీ ఆలోచనా, ప్రతీ పెట్టుబడి భవిష్యత్ తరాలకు సంపదగా మారాలని గవర్నర్ ఆకాంక్షించారు.

====================

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధిపై అధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఆలయాల అభివృద్ధి, పరిరక్షణకు

కట్టుబడి ఉంటుందని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేలా పలు అభివృద్ధి చర్యలు చేపట్టామన్నారు. దేవాదాయ శాఖ మంత్రితో చర్చించి పిఠాపురం పరిధిలోని ఆలయాల అభివృద్ధికి నిధులు కోరామని, ప్రధాన ఆలయాలతో పాటు మొత్తం 19 ఆలయాలను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేసేందుకు సూత్రప్రాయంగా ఆమోదం లభించిందన్నారు. అలాగే.. జీర్ణావస్థకు చేరిన ఆలయాలకు పునరుజ్జీవం కల్పించే పనులుకు అవసరమైన నిధులు దేవాదాయ శాఖ సమకూరుస్తుందని పవన్ కళ్యాణ్ తెలియజేశారు.

====================

సీఐఐ సదస్సు ద్వారా విశాఖ, అమరావతి, తిరుపతిలో పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులు రానున్నాయని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈరోజు సీఐఐ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఈ సదస్సులో పర్యాటక రంగంలో సుమారు 100 అవగాహన ఒప్పందాలు చేసుకుంటున్నామన్నారు. అన్ని వర్గాల వారికి అందుబాటులో పర్యాటకం ఉంటుందని, పర్యాటక రంగం బాగుంటే ఆర్థిక పురోభివృద్ధి, ఉపాధి కల్పన, సాంస్కృతిక మార్పిడి జరుగుతుందని చెప్పారు. సీఐఐ సదస్సుకు మంచి స్పందన లభించిందని, దాదాపు 70కి పైగా దేశాల నుండి ప్రతినిధులు వచ్చారని తెలిపారు. విశాఖ కైలాసగిరి పై త్రిశూల్ ప్రాజెక్టును త్వరలోనే అందుబాటులో తీసుకొస్తామని, దేశంలోనే అతి పొడవైన గ్లాస్ బ్రిడ్జిని త్వరలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

====================

విశాఖలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో సింగపూర్ బృందంతో రాష్ట్ర ప్రభుత్వం ఒక అవగాహన ఒప్పందం చేసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సింగపూర్ హోంశాఖా మంత్రి షణ్ముగం సమక్షంలో అర్బన్ గవర్నెన్స్, రియల్ టైమ్, డిజిటల్ గవర్నెన్స్ ట్రాన్స్‌ఫర్మేషన్, సుస్థిరాభివృద్ధి అంశాలకు సంబంధించి ఈ ఒప్పందం జరిగింది. సింగపూర్ విదేశీ వ్యవహారాలు, ట్రేడ్ ఇండస్ట్రీ మంత్రి గాన్ సో హాంగ్ - రాష్ట్ర విద్య, ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ ఎంఓయూలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా విజయవాడ- సింగపూర్ మధ్య విమాన సర్వీసు నడపాలని నిర్ణయించారు. అనంతరం మాట్లాడిన మంత్రి నారా లోకేష్, ఈ ఒప్పందం ఓ అద్భుతమైన ప్రయాణానికి నాంది అని పేర్కొన్నారు.

====================

విరామం

====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వ పటిమ, స్పష్టమైన విధానాలు, వాటిని కచ్చితమైన అమలు చేయడం వంటి వాటి ద్వారా దేశ అభివృద్ధి సాధ్యమైందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సీఐఐ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. దేశంలో టెలికం రంగంలో 25 బిలియన్ డాలర్ల పెట్టుబడికి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కొత్త సంస్థలు, పరిశ్రమలు, పెట్టుబడులు పెట్టేందుకు అవసరమైన అనుమతులు త్వరితగతిన మంజూరు చేసేందుకు కమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ సన్నద్ధంగా ఉందన్నారు. భారత్‌లో పెట్టుబడి పెట్టడం అంటే ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న మధ్యతరగతి మార్కెట్‌తో అనుసంధానం కావడమే అని, భవిష్యత్ గ్లోబల్ వ్యాపారంలో భాగస్వాములు కావడమే అని కేంద్ర సహాయ మంత్రి పేర్కొంటూ...

(వాయిస్...30 సెకన్లు)

====================

చేనేత, హస్త కళాకారులకు ఆర్థికంగా ఊతమిచ్చేలా ఆయా ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ సదుపాయం కల్పిస్తున్నామని చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్. సవిత తెలిపారు. విశాఖ సీఐఐ సదస్సులో చేనేత, జౌళి శాఖలకు చెందిన మూడు అంగళ్ళను ఆమె.. గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో కలిసి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేనేత, హస్త కళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. చేనేత వస్త్రాలు, హస్త కళారూపాల విక్రయాలు పెరిగేలా రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎగ్జిబిషన్లు, బజార్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఐఐ సదస్సులో ప్రత్యేక పెవిలియన్ ఏర్పాటు చేసి చేనేత, హస్త కళల స్టాళ్లు ఏర్పాటు చేశామని మంత్రి తెలియజేశారు.

====================

ఏషియన్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ 2025లో వెన్నం జ్యోతి సురేఖ, ధీరజ్ బొమ్మదేవర లు అద్భుత ప్రతిభ కనబరిచారు. కాంపౌండ్ మహిళల వ్యక్తిగత విభాగంలోను, జట్టు విభాగంలో జ్యోతి సురేఖ రాణించి, రెండు స్వర్ణ పతకాలు సాధించింది.

రికర్వ్ పురుషుల వ్యక్తిగత విభాగం ఫైనల్‌లో కొరియా ఆర్చర్‌పై ఘన విజయంతో ధీరజ్ బొమ్మదేవర స్వర్ణ పతకం సాధించారు. అద్భుత విజయాలు సాధించి దేశానికి గౌరవం తీసుకువచ్చిన జ్యోతి సురేఖకు, ధీరజ్ బొమ్మదేవరకు శాప్ ఛైర్మన్ ఏ. రవి నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. వీరి విజయం రాష్ట్ర యువ క్రీడాకారులకు ప్రేరణ అని ఆయన కొనియాడారు.

====================

కేన్సర్ కేసుల నమోదుకు అనుగుణంగా కేన్సర్ అట్లాస్ త్వరలో తయారవుతుందని ప్రముఖ కేన్సర్ వ్యాధి నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు వెల్లడించారు. మంగళగిరిలోని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో కేన్సర్ డిసీజ్ బర్డన్ 5వ అడ్వయిజరీ సమావేశం ఆయన అధ్యక్షతన ఈరోజు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేన్సర్ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన పెంచేందుకు, ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు, వైద్య సదుపాయాలు మెరుగుపరిచేందుకు కేన్సర్ అట్లాస్ దోహదపడుతుందన్నారు. కేన్సర్ వ్యాధి సోకిన వారు ఆందోళనకు గురికాకుండా వైద్య సిబ్బందికి సహకరించాలని డాక్టర్ దత్తాత్రేయుడు కోరారు.

====================

దివ్యాంగుల కోసం 'సదరం' కింద స్లాట్ల బుకింగ్స్ తిరిగి ప్రారంభమయ్యాయని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. సదరం స్లాట్ బుకింగ్స్ నేటి నుండి డిసెంబరు నెలాఖరు వరకు కొనసాగిస్తామన్నారు. కాకినాడ, తుని, ప్రత్తిపాడులలో దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ పరీక్షలు జరుగుతాయన్నారు. చూపు మందగించడం, వినికిడి లోపం, మానసిక వైకల్యం, బుద్ధిలోపం కేటగిరిల్లో దరఖాస్తుదారులకు ఉన్న వైకల్య శాతాన్ని అనుసరించి సర్టిఫికెట్లు జారీ చేస్తారని, వీటికి అనుగుణంగా పింఛన్, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత లభిస్తుందని కలెక్టర్ తెలియజేశారు.

====================

పంటను సులువుగా విక్రయించుకునే వెసులుబాటు రైతులకు కల్పించాలని విజయనగరం జిల్లా కలెక్టర్ రాం సుందర్ రెడ్డి వ్యవసాయ అధికారులకు సూచించారు. జిల్లాలోని గంట్యాడ, బొండపల్లి మండలాల్లో ఆయన ఈరోజు పర్యటించి, మామిడి, టమాట పంటల ప్రకృతి వ్యవసాయాన్ని, ఉద్యాన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా.. పంటకు మార్కెట్ సౌకర్యం లేకుంటే రైతులు ఇబ్బందులు పడతారని, మార్కెటింగ్ సదుపాయంపై దృష్టి పెట్టాలని వ్యవసాయ అధికారులకు సూచించారు.

====================
====================